# సాక్షి హనుమకొండ

గురువారం । 7 । మార్చి । 2024






**మేడారం హుండీల లెక్కింపు పూర్తి**

మేడారం హుండీల లెక్కింపు పూర్తయ్యింది. మొత్తం రూ.13,25,22,511 ఆదాయం వచ్చింది. 779 గ్రాముల బంగారం, 55 కిలోల వెండి లభించింది. - 8లో▸



**సమాజహిత ఆవిష్కరణలు జరగాలి**

సమాజానికి ఉపయోగపడే ఇంజనీరింగ్ ఆవిష్కరణలు చేయాలని కేయూ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేష్ సూచించారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$38^0$ /$22^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం ఆహ్లాదంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం వేళ చల్లగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### రేపు కల్యాణ మండపం ప్రారంభం



**హన్మకొండ కల్చరల్ :** వేయిస్తంభాల దేవాలయం కల్యాణమండపం 17 ఏళ్ల తరువాత ఓరుగల్లు ప్రజలకు, పర్యాటకులకు అందుబాటులోకి రానుంది. మండపం శిథిలావస్థకు చేరడంతో 2006లో తొలగించి తిరిగి పనులు చేపట్టారు. ఎట్టకేలకు పనులు పూర్తి కావడంతో హైదరాబాద్ కేంద్రపురావస్తుశాఖ సౌజన్యంతో ఈ నెల 8న శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తారు. అతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు.

### ఎల్‌ఎల్‌బీ పరీక్షలు షురూ

**కేయూ క్యాంపస్:** కేయూ పరిధిలో ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సు మూడో సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు ఏడో సెమిస్టర్‌కు సంబంధించిన పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి పరిశీలించారు. ఆయన వెంట అదనపు పరీక్షల నియంత్రణాధికారి సీహెచ్ రాధిక, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, మహిళా యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ బీఎస్ఎల్ సౌజన్య, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేశ్ ఉన్నారు. కాగా.. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో కాపీయింగ్ చేస్తున్న 8 మంది విద్యార్థులను మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి తెలిపారు.

### కమిషనరేట్‌లో ఇద్దరు ఏసీపీల బదిలీ

**వరంగల్ క్రైం:** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏసీపీల బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఇద్దరు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బి.నందిరాంనాయక్ సీబీడీ నుంచి వరంగల్ ఏసీపీ, బోనాల కిషన్ వరంగల్ ఏసీపీ నుంచి నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీగా బదిలీ అయ్యారు.

### కలెక్టరేట్‌లో ఫుడ్ ఫెస్ట్



**హన్మకొండ అర్బన్:** ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళా అధికారులు, ఉద్యోగులు బుధవారం ఫుడ్ ఫెస్ట్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఫెస్ట్‌లో పాల్గొన్న మహిళా అధికారులు, ఉద్యోగులు చేసిన వంటలను రుచి చూసి వారిని అభినందించారు. అనంతరం చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు నీరజ, ఉపాధ్యక్షులు మాధవీలత, ప్రతినిధులు మాధవి, లావణ్య, రజిత, రాణి, తదితరులు పాల్గొన్నారు.

### 'రైతు నేస్తం' ప్రారంభం



**పరకాల:** పరకాల వ్యవసాయ మార్కెట్‌లోని రైతువేదికలో ఏర్పాటు చేసిన 'రైతు నేస్తం' దృశ్యశ్రవణ మాధ్యమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంట మార్పిడి విధానం, పంట బీమా, ఫసల్ బీమా, సేంద్రియ పద్ధతులపై ప్రసంగించారు. పరకాల ఎంపీపీ టి.స్వర్ణలత, జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్, మండల వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పలివేల్పులలో..**

**హసన్‌పర్తి:** పలివేల్పుల రైతు వేదికలో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, జేడీ రవీందర్, ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఉద్యాన వనశాఖ అధికారి శ్రీనివాస్, కార్పొరేటర్ అరుణకుమారి, వ్యవసాయాధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల స్కాంలో కదలిక!



**గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై ఆరా**

- ఉమ్మడి వరంగల్‌లో పది మంది పాత్ర.. గతంలోనూ విచారించి వదిలేసిన 'విజిలెన్స్'
- ముగ్గురిపై చర్యలు.. పెండింగ్‌లో ఆర్‌ఆర్ యాక్టు
- 'కాగ్' నివేదిక, ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి ఏసీబీ
- గొర్రెల పంపిణీ యూనిట్లు, లబ్ధిదారుల వివరాల సేకరణ
- పశుసంవర్థకశాఖలో మళ్లీ కలకలం



<u>సాక్షిప్రతినిధి, వరంగల్:</u>

గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన స్కాం ఓరుగల్లును తాకింది. ఈస్కాంపై కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించడంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దూకుడు పెంచింది. ఉమ్మడి జిల్లాలోనూ అవకతవకలు జరగడం.. 'కాగ్' నివేదిక, ప్రభుత్వ ఆదేశాల మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు మొదటి, రెండో విడతల్లో పంపిణీ చేసిన యూనిట్లు, లబ్ధిదారుల జాబితా, నిధుల కేటాయింపు తదితర వివరాలు సేకరిస్తుండడం పశుసంవర్థకశాఖలో చర్చనీయాంశంగా మారింది.

**మొదటి విడత 97 శాతం...**
**రెండో విడత 9.6 శాతానికే బ్రేక్..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 575 సహకార సంఘాలున్నాయి. వీటిలో సుమారు 60 వేల మంది సభ్యులుగా ఉన్నారు. విడతల వారీగా అర్హులందరికీ గొర్రెల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. 2017లో ఉమ్మడి జిల్లాకు మొదటి విడత (ఏ–లిస్టు)లో మొత్తం 50,678 యూనిట్లు మంజూరు చేసింది. ప్రతి యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున జిల్లాల వారీగా కోటా నిర్ణయించి పంపిణీ చేశారు. ఇద్దరు ఏడీలు, ఒక డాక్టర్, ఇద్దరు పారా సిబ్బంది ఒక కమిటీగా మొత్తం ఉమ్మడి జిల్లాలో సుమారు 12 కమిటీల ద్వారా మహారాష్ట్రతోపాటు కడప జిల్లాలోని ఆరు మండలాల్లో గొర్రెల కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. వాటికి ఇన్సూరెన్స్ ట్యాగ్‌లు పూర్తయిన అనంతరం అక్కడి నుంచి వాహనాల ద్వారా జిల్లాకు పంపకుండా అక్రమాలకు పాల్పడ్డారు. మొదటి విడతలో పలుచోట్ల లెక్కలేనన్ని అవినీతి అక్రమాలు జరగడం.. అవి వెలుగు చూడటంతో 3,787 మంది లబ్ధిదారులకు పంపిణీ తర్వాత రెండో విడతకు బ్రేక్ పడింది.

**కొనుగోలు రోజే గొర్రెలు మాయం..**
**విజిలెన్స్ గుట్టువిప్పినా పట్టని 'ఫెడరేషన్'.**

పథకం ఆరంభంలో శ్రద్ధ వహించిన ఉన్నతాధికారులు రానురాను మండల పశువైద్యాధికారులకే జీవాల కొనుగోలు బాధ్యత ఇచ్చేశారు. దీంతో గొర్రెలు లబ్ధిదారుల ఇంటికి చేరకముందే చేతులు మారాయి. కొన్నిచోట్ల ఇతర ప్రాంతాల నుంచి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వరకు చేరుకొని, మళ్లీ తరలిపోయాయి. ఈ అక్రమాల తంతులో పలువురు మండల పశువైద్యాధికారులే కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు వచ్చాయి. కొనుగోలుకు వెళ్లిన అధికారులు అటు అమ్మకందారులతో ఒప్పందం కుదుర్చుకొని తక్కువ ధర పలికే గొర్రెలకు ఎక్కువ ధర నిర్ణయించడం.. ఒక యూనిట్‌లో నాలుగు చిన్న పిల్లలను వేసి పెద్దవాటికి సమానంగా వెల కట్టినట్లు 'విజిలెన్స్' విచారణలో తేలింది. ఉమ్మడి జిల్లాలో మొదటి విడతలో పంపిణీ చేసిన రాయితీ గొర్రెలను మెజారిటీ లబ్ధిదారులు వెంటనే అమ్మేయగా, కొన్నిచోట్ల రీసైక్లింగ్ చేసినట్లు వెల్లడైంది. వీటన్నింటిపై వెల్లువెత్తిన ఫిర్యాదులపై దృష్టి సారించిన అప్పటి ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపించి మొక్కుబడి చర్యలతో మమ అనిపించింది.

- జయశంకర్ భూపాలపల్లికి చెందిన డీవీఅండ్ఏహెచ్ఓ డాక్టర్ ఎం.బాలకిషన్, జనగామ జిల్లా బచ్చన్నపేట వీఏఎస్ డాక్టర్ కె.హరికిషన్‌పై చర్యలకు అప్పటి విచారణ బృందం ఫెడరేషన్ ఎండీకి సిఫారసు చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 మందిపై చర్యలకు సిఫారసు చేసినా.. తదుపరి చర్యలు, రెవెన్యూ రికవరీ యాక్టులు ఆగిపోయాయి.
- 2019 ఆగస్టులో వరంగల్ జిల్లా నుంచి ఎల్కతుర్తి ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఐదు లారీలతో పాటు 574 గొర్రెలను అప్పట్లో పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా 13 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. .
- చిల్పూరు మండలం చిన్నపెండ్యాలలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 12 యూనిట్లలో అవకతవకలు చోటు చేసుకోవడంతో అక్కడి పశువైద్యాధికారిని సస్పెండ్ చేశారు. మొదటి విడత గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు విచారణ జరిపి 10 మందిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించినా.. అది జరగలేదు. ఇలా చాలా ఘటనలు జరిగినా మొక్కుబడి చర్యలతో మమ అనిపించారు. గొర్రెల పంపిణీ పథకంపై తాజాగా ఏసీబీ ఆరా తీస్తున్న నేపథ్యంలో ఈ అక్రమాల వెనుక అసలు సూత్రధారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**జిల్లాల వారీగా గొర్రెల పంపిణీ తీరు ఇలా..**

| జిల్లా | మంజూరు | గ్రౌండింగ్ | శాతం |
|---|---|---|---|
| **ఏ–లిస్టు (మొదటి విడత)** | | | |
| వరంగల్ అర్బన్ | 5,653 | 5,580 | 99 |
| వరంగల్ రూరల్ | 12,793 | 12,793 | 100 |
| మహబూబాబాద్ | 11,886 | 11,588 | 97 |
| జేఎస్ భూపాలపల్లి/ములుగు | 9,687 | 8,636 | 89 |
| జనగామ | 10,659 | 10,659 | 100 |
| **బీ–లిస్టు (రెండో విడత)** | | | |
| వరంగల్ అర్బన్ | 5,571 | 1,349 | 23 |
| వరంగల్ రూరల్ | 12,748 | 77 | 01 |
| మహబూబాబాద్ | 11,868 | 30 | 00 |
| జేఎస్ భూపాలపల్లి/ములుగు | 6,791 | 573 | 08 |
| జనగామ | 10,772 | 1,758 | 16 |

# మల్లన్న బ్రహ్మోత్సవాలు షురూ



సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్న ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు

**ఐనవోలు:** ఐనవోలు ఆలయంలో శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో స్వామి మేల్కొనగా.. అర్చకులు వేద మంత్రాలతో నిత్య పూజలు నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం ఉత్సవ మూర్తులతో సూర్యప్రభ వాహన సేవ నిర్వహించగా.. ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు శ్రీనివాస్ వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి మాడ వీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**జాతర ప్రారంభం**

ఒక ధృడమైన నూతన వస్త్రంపై నందీశ్వరుడి చిత్రాన్ని లిఖించారు. ఆ చిత్రించిన నూతన వస్త్రాన్ని శ్రీమల్లిఖార్జున స్వామి ధ్వజ స్తంభ శిఖరాగ్రాన ఎగురవేశారు. అర్చకులు దీన్ని ధ్వజారోహణం అంటారు. నందీశ్వరుడు తన ప్రభువైన మల్లికార్జునుడికి జరగబోతున్న బ్రహ్మోత్సవాలకు ఊర్ధ్వ లోకాల్లోని సకల దేవతా గణాలు రావాలని ఆహ్వానిస్తున్నట్లుగా.. ఆ సమయంలో వేదపండితులు మంత్ర పఠనం చేశారు. దీంతో బ్రహ్మోత్సవ జాతర ప్రారంభమైనట్లు ఆలయ అర్చకులు ప్రకటించారు.

అనంతరం రాత్రి చంద్ర ప్రభ వాహనసేవ విద్యుత్ దీప అలంకారాల మధ్య ఘనంగా నిర్వహించారు.

**బందోబస్తు ఏర్పాట్ల పర్యవేక్షణ**

మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో పాటు పెద్దపట్నం వద్ద తొక్కిసలాట జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో పర్వతగిరి సీఐ శ్రీనివాస్ బుధవారం బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గతంలో జరిగిన పరిణామాల్ని ఒగ్గు పూజారులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఐనవోలు, పర్వతగిరి ఎస్సైలు గైకడి అనిల్ కుమార్, గుగులోతు వెంకన్నకు సూచించారు.

# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- అధికారులకు శిక్షణ



నివాళులర్పిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్, అధికారులు

**హన్మకొండ అర్బన్:** పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)పై ఎంసీసీ టీం, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీం, సెక్టోరియల్ ఆఫీసర్లు, వీడియో సర్వేలెన్స్ టీం, వీవీ టీం, ఎన్నికల వ్యయ పరిశీలకుల టీంల ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. సమష్టి కృషితో ఎన్నికల్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన వివిధ అంశాలపై అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎల్ఎంటీ భాస్కర్‌రెడ్డి ఎన్నికల బృందాల అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ వైవీ గణేశ్, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ, ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, హనుమకొండ, పరకాల ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, కిషోర్‌కుమార్, ఆర్డీఓలు నారాయణ, వెంకటేశ్, డీఈఓ అబ్దుల్ హై, తదితరులు పాల్గొన్నారు.

**పంకజ్ ద్వివేదికి నివాళి..**

ఇటీవల మరణించిన రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి పంకజ్ ద్వివేదికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు బుధవారం నివాళులర్పించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పంకజ్ ద్వివేది చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా 1985–86లో పంకజ్ ద్వివేది పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 2012లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ వైవీ గణేశ్, అధికారులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యమివ్వాలి

**పరకాల ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి శాలిని లింగం**



జడ్జి శాలిని లింగంతోపాటు కోర్టు మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న న్యాయవాదులు

**పరకాల:** మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తేనే వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని పరకాల ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి శాలిని లింగం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పరకాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరకాల జూనియర్ సివిల్ జడ్జి శాలిని లింగంతో పాటు కోర్టు ఉద్యోగులను న్యాయవాదులు సన్మానించారు. ఈసందర్భంగా జడ్జి శాలిని లింగం మాట్లాడుతూ.. మహిళలు సాధికారత సాధించినప్పుడే సమాజంలో వారి స్థితిగతులు మెరుగుపడతాయని, శాంతి సౌభ్రాతృత్వాలు, సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయన్నారు. కార్యక్రమంలో పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.చంద్రమౌళి, సీనియర్ న్యాయవాదులు పున్నం రాజిరెడ్డి, ఎం.రవీంద్రబాబు, ఒంటేరు రాజమౌళి, మేరుగు శ్రీనివాస్, గండ్ర నరేశ్‌రెడ్డి, ఎం.శ్రావణ్‌కుమార్, లక్కం శంకర్, జి.రాహుల్, విక్రమ్, టి.పరమేశ్వర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల్ని విజయవంతం చేయండి

**వేయిస్తంభాల ఆలయ ఈఓ వెంకటయ్య**



దేవాలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

**హన్మకొండ కల్చరల్:** వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న మహా శివరాత్రి బ్రహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ఈఓ వెంకటయ్య అన్నారు. మహా శివరాత్రి ఏర్పాట్లను పురస్కరించుకుని బుధవారం హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. మహాశివరాత్రి ఉత్సవాల్లో జరిగే అన్ని పూజల్లో రూ.21,116 చెల్లించి పాల్గొనవచ్చని.. విడిగా చండీహోమంలో పాల్గొనేవారు రూ. 3,116, స్వామివారి కల్యాణంలో పాల్గొనేందుకు రూ. 1116, లింగోద్భవ కాల పూజ కోసం రూ.12,116, అన్నపూజకు రూ.5,116 చెల్లించి పాల్గొనేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. జాగరణ చేసే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి నృత్యాలు, హరికథ భజనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# అబద్ధాలకోరు కాంగ్రెస్... అడ్డగోలు హామీలు

**ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ఆందోళన**



ధర్నాలో పాల్గొన్న వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నాయకులు, కార్యకర్తలు



వరంగల్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

**హన్మకొండ:** అబద్ధాల కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ దుయ్యబట్టారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ఉచితంగా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్‌కు ఎవరూ డబ్బులు చెల్లించవద్దని, తాము అధికారంలోకి రాగానే ఉచితంగా చేస్తామని చెప్పిన నాయకులు అధికారంలోకి రాగానే మాట మార్చారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, 'కుడా' చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, నాయకులు తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, సల్వాజి రవీందర్‌రావు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**వరంగల్‌లో..**

**వరంగల్ చౌరస్తా:** ఎల్ఆర్ఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అమలు చేసేంత వరకూ ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఎల్ఆర్ఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వరంగల్ చౌరస్తాలో బుధవారం ధర్నా చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ గందె కల్పన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు మరుపల్లి రవి, సిద్ధం రాజు, పల్లం పద్మ, బోగి సువర్ణ, మార్కెట్ మాజీ చైర్మన్ రమేశ్‌బాబు, నాయకులు దుబ్బ శ్రీనివాస్, మనోహర్, రాంకీ యాదవ్, ఒలిశెట్టి అనిల్ పాల్గొన్నారు.

# ఈ–సేవ కేంద్రాల్లో బారులు

**మొరాయించిన సర్వర్**



బల్దియా ప్రధాన కార్యాలయంలో బారులుదీరిన ప్రజలు

**వరంగల్ అర్బన్:** ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పుల సవరణకు బుధవారం సర్వర్ మొరాయించింది. దీంతో ఈ–సేవ కేంద్రాల వద్ద ప్రజలు బారులుదీరారు. కొద్దిసేపు పని చేయడం, మళ్లీ సాంకేతిక లోపాలు ఏర్పడడంతో చాలా మేరకు ఆపరేటర్లు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరించారు. నగరవ్యాప్తంగా రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఎల్‌పీజీయూఎస్‌సీ నంబరు(కరెంటు బిల్లుల)కు సంబంధించి 502 సవరణలు చేసినట్లు బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. నూతనంగా 84 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల సవరణ, కొత్త దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని ఆయన తెలిపారు.

# శాంతి భద్రతలను కాపాడాలి

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో సిబ్బంది పని తీరును పరిశీలిస్తున్న సీపీ

**ఖిలా వరంగల్:** పెండింగ్ కేసుల్ని త్వరితగతిన పరిష్కరిస్తూ శాంతి భద్రతలను కాపాడాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ఆదేశించారు. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌ను బుధవారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ)అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏసీపీ బోనాల కిషన్, ఇన్‌స్పెక్టర్ మల్లయ్యతో కలిసి ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణ, పరిసరాల్ని పరిశీలించారు. అనంతరం పెండింగ్ కేసుల వివరాలు, నేరాలు, శాంతిభద్రతల నియంత్రణ కోసం ముందస్తుగా తీసుకుంటున్న చర్యలపై ఆయన సబ్ ఇన్‌స్పెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని కేడీలు, డీసీలు, రౌడీషీటర్లకు సంబంధించిన వివరాలు ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. తర్వాత శాఖాపరమైన సమస్యల గురించి సిబ్బందిని సీపీ అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా మెలగాలని, సమస్యల పరిష్కారానికి పోలీసులు బాధ్యతగా కృషి చేయాలన్నారు. అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, ఎస్సైలు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్లీపర్ బస్సు చార్జీలో 10శాతం రాయితీ



**హన్మకొండ:** హనుమకొండ–హైదరాబాద్–బెంగళూరు రూట్‌లో నడిచే లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులో ప్రయాణించేవారికి చార్జీలో 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 30 వరకు రాయితీపై టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నవ్విన నువ్వులు

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాకు రూ.12వేలు
- మద్దతుకు మించి రికార్డు ధరతో రైతుల్లో ఆనందం



కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం క్వింటా నువ్వులకు రికార్డు స్థాయిలో గరిష్ట ధర రూ.12,009 పలికింది. నువ్వులకు మద్దతు ధర రూ.8,635 ఉండగా, మద్దతుకు మించి ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మంగళవారం మార్కెట్‌కు వచ్చిన క్వింటా నువ్వులకు గరిష్ట ధర రూ.9,029 పలుకగా, బుధవారం అమ్మకానికి వచ్చిన నువ్వులకు గరిష్ట ధర రూ.12,009 పలికింది. నువ్వుల సాగు పూర్తిస్థాయిలో తగ్గిపోవడం మూలంగా, మార్కెట్‌లో నువ్వుల ధరలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. కాగా కందులకు మద్దతు ధర రూ.7,000 ఉండగా, బుధవారం మార్కెట్‌కు 20 బస్తాల కందులు అమ్మకానికి వచ్చాయి. గరిష్ట ధర రూ.9,611, కనిష్ట ధర రూ.8,639 పలికింది. పెసర్లకు మద్దతు ధర రూ.8,558లు ఉండగా, గరిష్ట ధర రూ.8,689, కనిష్ట ధర రూ.7,433 పలికినట్లు మార్కెట్ అధికారులు వెల్లడించారు. బొబ్బెర్లకు క్వింటాకు గరిష్ట ధర రూ.7,333, కనిష్ట ధర రూ.6,839 పలికింది.

## వరంగల్ మార్కెట్‌కు సెలవులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా 8నుంచి 10వ తేది వరకు మూడు రోజులు ఉన్నందున మార్కెట్‌లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ ఉన్నతశ్రేణి సెక్రటరీ సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ (శుక్రవారం)మహాశివరాత్రి, 9(శనివారం) శివరాత్రి జాగరణ సెలవు, 10వ తేదీ(ఆదివారం) వారాంతపు సెలవుతో మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. ఈవిషయాన్ని సమస్త రైతు సోదరులు, వ్యాపారులు, గుమస్తాలు, దడవాయి, కార్మికులు గమనించి, సహకరించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

హసన్‌పర్తి: ప్రమాదవశాత్తు మిషన్ భగిరథ గేట్ వాల్‌కు ఏర్పాటుకు ఇనుప కంచెను ఢీకొట్టడంతో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈఘటన పెగడపల్లి– గుండ్లసింగారం ప్రధాన రహదారిలోని గుంటూరుపల్లి వద్ద చోటు చేసుకుంది. ఈమేరకు మృతుడి భార్య సాంబలక్ష్మి బుధవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి.. పెగడపల్లికి చెందిన పరికరాల రాజన్న(56) ఆటో నడపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజన్న మంగళవారం రాత్రి ఆటో డ్రైవింగ్ చేసుకుంటూ పెగడపల్లి డబ్బాల మీదుగా గుండ్లసింగారం నుంచి ఇంటికి బయల్దేరాడు. గుంటూరుపల్లి సమీపంలో రోడ్డు పక్కన మిషన్ భగిరథ గేట్ వాల్‌కు ఏర్పాటు చేసిన ఇనుప కంచెను ఆటో ఢీకొంది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజన్నను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సాంబలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.



# అమ్మకు ఆసరా



కోమటిరెడ్డి సుశీలమ్మ అనాథ వృద్ధాశ్రమం

**రూ.13కోట్లతో వృద్ధాశ్రమం**

- అత్యాధునిక హంగులతో ఏర్పాట్లు
- తల్లి పేరిట ఎమ్మెల్యే కోమటిరెడ్డి దాతృత్వం
- ఎన్‌జీఓ, ప్రభుత్వ సహకారంతో సేవలు
- నేడు ప్రారంభోత్సవం

జనగామ: ఆరుపదుల వయస్సులో ఎవరి ఆదరణ లేని అనాథ బతుకులకు భరోసా కల్పిస్తున్నారు. అమ్మ ప్రేమను గుర్తుకు చేసుకుంటూ.. అనాథ తల్లులకు పెద్దకొడుకయ్యారు. భౌతికంగా తన తల్లి లేకున్నా.. ఆమె జ్ఞాపకాలను వృద్ధాశ్రమ రూపంలో చూసుకోవాలని తలచారు.. మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. ఆయన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా వృద్ధాశ్రమ భవనం నిర్మించి ఆదరణ లేని తల్లులకు నీడనిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందు కోసం రూ.13కోట్ల పైగా నిధులు ఖర్చు చేసి వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయగా.. ఆయన సతీమణి లక్ష్మి.. ఫౌండేషన్ చైర్మన్‌గా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

జనగామ మండలం సిద్దిపేట రోడ్డు శామీర్‌పేట శివారులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తల్లి సుశీలమ్మ పేరిట అనాథ మహిళా వృద్ధాశ్రమం నిర్మించారు. రుద్రమ దేవి మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఉన్న భూమిని విరాళంగా ఇవ్వగా, భవన నిర్మాణం కోసం కోమటిరెడ్డి ముందుకొచ్చారు. మహానేత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా అప్పట్లో భూమి పూజ చేయగా.. ప్రస్తుతం అనాథ వృద్ధులకు సేవలందించేందుకు సిద్ధమైంది.

**126 మంది వృద్ధులకు సేవలు**

మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో ఎకరన్నరలో అనాథ ఆశ్రమం.. మరో ఎకరన్నరలో గ్రీనరీ, కూరగాయల తోటలు తదితరాలకు వినియోగిస్తున్నారు. ఇందులో 126మంది వృద్ధుల కోసం సౌకర్యాలు కల్పించారు. 8బ్లాక్‌లుగా విభజించి, 7వృద్ధులకు మరొకటి సిబ్బంది కోసం కేటాయించారు. ఒక్కో బ్లాక్‌లో 18మంది వృద్ధులు ఉండేలా ప్లాన్ చేశారు. ప్రతి బ్లాక్‌లో కేర్‌టేకర్ పర్యవేక్షణ 24గంటల పాటు ఉంటుంది. వృద్ధులకు అత్యవసర సమయంలో వైద్య పరీక్షలు అందించేలా డాక్టర్ సెల్ ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ వార్డులో నాలుగు ఐసీయూ బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్‌తోపాటు ఇద్దరు డాక్టర్లు, నలుగురు నర్సులు సేవలందిస్తారు. నిరంతర పర్యవేక్షణకు 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వృద్ధుల కాలక్షేపం కోసం ప్రత్యేక హాల్ నిర్మించి, అందులో భారీ ఎల్‌ఈడీ టీవీని అమర్చారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఏసీ కిట్లను అమర్చారు. అంబులెన్స్ వాహనం సైతం ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వృద్ధాశ్రమంలో సగం మేర సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ వినియోగించేలా చర్యలు చేపట్టారు. ఆశ్రమం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సేంద్రియ పద్ధతులతో వరి, కూరగాయలు సాగు చేసేందుకు ఆలోచన చేస్తున్నారు.

**నేడు ప్రారంభం**

కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన మహిళా అనాథ వృద్ధాశ్రమం నేడు ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ నాయకులు వేమెళ్ల సత్యానారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కంచరాములు, రుద్రమదేవి సొసైటీ అధ్యక్షురాలు కవిత, దేవేందర్, మల్లేశం ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆశ్రమంలో ఏర్పాటు చేసిన హాల్

### మహిళా అనాథ వృద్ధాశ్రమం పరిశీలన



ఆశ్రమంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

జనగామ మండలం శామీర్‌పేట శివారు పసరమడ్లలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మహిళా అనాథ వృద్ధాశ్రమం గురువారం(నేడు) ప్రారంభ ఏర్పాట్లను బుధవారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ఆశ్రమంలో వసతి సౌకర్యాలు, కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి రాజగోపాల్ రానున్న నేపథ్యంలో నిర్వాహకులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రం నుంచి వచ్చిన ఉన్నతాధికారులు శైలజ, ఏడీ రాజేందర్ కలెక్టర్‌తో చర్చించారు. డీడబ్ల్యూఓ జె.జయంతి తదితరులు పాల్గొన్నారు.

## ‘పార్లమెంట్’ బరిలో బీఎల్‌ఎఫ్ అభ్యర్థులు

- ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

వరంగల్ చౌరస్తా: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా అన్ని స్థానాల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్‌ఎఫ్) అభ్యర్థులు పోటీ చేస్తారని రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్ తెలిపారు. బుధవారం బీఎల్‌ఎఫ్ వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల ఎన్నికల సన్నాహక సమావేశం నర్ర ప్రతాప్ అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంపలోని ఓంకార్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. అవినీతి అవకాశవాద రాజకీయ అభ్యర్థులను ఓడించి, బీఎల్‌ఎఫ్ బలపరిచే అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని కోరారు.

**కన్వీనర్ల నియామకం**

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల బీఎల్‌ఎఫ్ కన్వీనింగ్ కమిటీని రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్ ప్రకటించారు. మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్‌గా కంచ వెంకన్న, కో కన్వీనర్‌గా బాబురావు, సభ్యులుగా వంగల రాగసుధ, గుండెబోయిన చంద్రయ్య, మేక మోహన్‌రావు, రాజమౌళి, బిచ్చానాయక్, ఉపేందర్‌ను నియమించారు. వరంగల్ పార్లమెంట్ కన్వీనర్‌గా నర్ర ప్రతాప్, కో-కన్వీనర్‌గా మాస్ సావిత్రి, సభ్యులుగా ఐతం నాగేష్, మంద రవి, కనకం సంధ్య, రవీందర్, జగదీశ్వర్, ఎమ్మెస్ రావు, అరుణ్ నాయక్‌లను ప్రకటించారు. గాదగోని రవి, గోనె కుమారస్వామి, రమేష్ హంసారెడ్డి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



టీఎన్‌జీవో డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, బాధ్యులు

- టీఎన్‌జీఓ సమావేశంలో ఎమ్మెల్యే నాయినిరాజేందర్‌రెడ్డి

విద్యారణ్యపురి: ఉద్యోగుల సహకారంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఉద్యోగులకు అండగా ప్రభుత్వం ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాలలో హనుమకొండ జిల్లా టీఎన్‌జీవోఎస్ యూనియన్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, నూతన సంవత్సరం డైరీ ఆవిష్కరణ, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డైరీని ఆవిష్కరించిన అనంతరం నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. తన గెలుపులో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి సంపూర్ణమైన అవగాహన ఉందన్నారు. వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు అనునిత్యం అందుబాటులో ఉంటామన్నారు. టీఎన్‌జీవోఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగుల గొంతు నొక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి ఫ్రెండ్లీ ఎంప్లాయి ప్రభుత్వం అన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎ.రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను విజయవంతం చేసేందుకు కృషిచేస్తామన్నారు. సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. టీఎన్‌జీవో కేంద్రసంఘం మాజీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ఉద్యోగసంఘాల మాజీ చైర్మన్ పరిటాల సుబ్బారావు, టీఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ బైరి సోమయ్య, ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు గణిపాక రాజకుమార్, పుల్లూరి వేణుగోపాల్, పనికల రాజేష్, కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, రామినేని శ్రీనివాస్‌రావు, శ్యాంసుందర్, రాము నాయక్, సారంగపాణి, మాయిస్, లక్ష్మీప్రసాద్, వివిధ జిల్లాల అధ్యక్షులు, యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా పలువురు ఉద్యోగినులను సన్మానించారు. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశం ప్రారంభానికిముందు ఉద్యోగులు కలెక్టరేట్ నుంచి ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు.

## సమాజహిత ఆవిష్కరణలు జరగాలి

- కేయూ వీసీ రమేష్



మాట్లాడుతున్న వీసీ రమేష్, వేదికపై రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: సమాజానికి ఉపయోగపడే ఇంజనీరింగ్ ఆవిష్కరణలు జరగాలని కేవలం తరగతి గది, ప్రయోగశాలలకే పరిమితం కాకుండా సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. బుధవారం యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఆడిటోరియంలో నిర్వహించిన రూబీజిస్ట్, టెక్నికల్ ఫెస్ట్ ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజ అవసరాలను గుర్తించి ఆవిష్కరణలు చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాబోయే విద్యాసంవత్సరంలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కేయూ ఏ ప్లస్ గ్రేడ్ సాధించటంలో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రాంగణ నియామకాలు ప్రధాన భూమికను పోషించాయన్నారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సదానందం మాట్లాడారు. ఈ టెక్నికల్ ఫెస్ట్‌లో 10కళాశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు.

**మోడల్స్‌ను తిలకించిన వీసీ, రిజిస్ట్రార్**

ఇంజనీరింగ్ విద్యార్థులు ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ కంప్యూటర్స్ సైన్స్ ఇంజనీరింగ్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించగా.. వీసీ, రిజిస్ట్రార్ పరిశీలించారు.

## కేసు విచారణ వేగంగా చేపట్టాలి

- కాజీపేటలో రైలు బోగీలను పరిశీలించిన రైల్వే ఎస్పీ



దగ్ధమైన రైలు బోగీని పరిశీలిస్తున్న ఎస్పీ సలీమా

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ రైల్వే యార్డులో మంగళవారం జరిగిన నిరుపయోగంగా నిలిపిఉన్న ప్యాసింజర్ రైలు బోగి దగ్ధమైన ఘటన కేసు విచారణ వేగంగా చేపట్టాలని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ సలీమా అన్నారు. బుధవారం ఆమె ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యార్డులో దగ్ధమైన రైలు బోగి, పరిసర ప్రాంతాలను పరిశీలించి రైల్వే పోలీసులతో చర్చించారు. కేసు పురోగతిపై పలు సలహాలు, సూచనలు చేసి కేసు విచారణను వేగంగా చేయాలని ఆదేశించినట్లు రైల్వే పోలీస్ అధికారులు తెలిపారు. కాజీపేట రైల్వే డీఎస్పీ తాళ్లపల్లి కృపాకర్, సికింద్రాబాద్ అర్బన్ డీఎస్పీ జావిద్, సీఐ రాంమూర్తి, ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, జీఆర్పీ ఎస్సై మొహినుద్దీన్ ఉన్నారు.

## తిరునాళ్ల పండుగ పనులు పూర్తి చేయండి

- కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రవీందర్

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ కేథడ్రల్‌లో ఈనెల 11, 12, 13 తేదీల్లో జరిగే ఫాతిమామాత తిరునాళ్ల పండుగలకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషన్ రవీందర్ పిలుపునిచ్చారు. కాజీపేట ఫాతిమానగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన సన్నహాక సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చే భక్తులకు కావాల్సిన అన్ని పనులను అన్ని విభాగాల వారు కలిసి చేయాలన్నారు. విచారణ గురువు ఫాదర్ కాసు మర్రెడ్డి మాట్లాడుతూ.. ఫాతిమా ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, అన్ని విభాగాల అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మానస రాంప్రసాద్, ఎలికంటి రాములు, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, కేథడ్రల్ చర్చి కమిటీ ప్రెసిడెంట్ బొక్క దయాసాగర్, బిషప్ సెక్రటరీ ఫాదర్ అనుకిరణ్, సంయుక్త విచారణ గురువు ఫాదర్ కరుణాకర్, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఎన్పీడీసీఎల్ ఏఈ శ్రీధర్, మున్సిపల్ ఏఈ శ్రీకాంత్, కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ పాల్గొన్నారు.

## రెవెన్యూ మేళాకు 16 దరఖాస్తులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న సిబ్బంది

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర వ్యాప్తంగా బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన టాక్స్ మేళాకు 16 దరఖాస్తులు వచ్చాయి. కాశిబుగ్గ సర్కిల్ పరిధికి సంబంధించి 6, ఖాజీపేట సర్కిల్ పరిధికి సంబంధించిన 10 దరఖాస్తులు అందినట్లు అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. ప్రతీ బుధవారం నిర్వహించే ఈమేళాలో నూతన ఇంటి నిర్మాణం తేడాలు, ఇంటి పన్ను సవరణ, ఇంటి యజమాని పేరు సవరణ, ఇంటి నంబర్ సవరణ, ఖాళీ స్థలానికి పన్ను విధింపు, ఖాళీ స్థలం, పన్ను నుంచి ఇంటి పన్ను మార్పు తదితర సమస్యలపై దరఖాస్తు సమర్పిస్తే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనిల్, సీనియర్ అసిస్టెంట్ ఇక్రాయిల్ పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

- ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలత



ప్రయాణికులు, ఉద్యోగులతో ఆర్‌ఎం

హన్మకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత అన్నారు. బుధవారం వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీలత మాట్లాడుతూ.. ఓర్పు, సహనంతో మహిళలు వివిధ రంగాల్లో అద్భుతంగా రాణిస్తూ అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల ఉద్యోగం ఎంతో శ్రమతో కూడుకున్నదన్నారు. ఈ సందర్భంగా నిరంతరం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళ ప్రయాణికులతోపాటు, అత్యధిక ఆదాయం తీసుకొచ్చిన మహిళా కండక్టర్లు, సూపర్ వైజర్లను ఆర్‌ఎం సన్మానించారు. డిప్యూటీ ఆర్‌ఎస్ కేశరాజు భానుకిరణ్, ప్రిన్సిపాల్ అర్పిత, భవాని, శ్వేత, లావణ్య పాల్గొన్నారు.

## 556మంది విద్యార్థుల గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో బుధవారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో 556మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ గోపాల్ తెలిపారు. జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి మొత్తంగా 19,154 మంది విద్యార్థులకుగాను 18,598మంది హాజరుకాగా 556మంది గైర్హాజరయ్యారు.

## మేడారం ఆదాయం రూ.13,25,22,511

- హుండీల్లోని కానుకల లెక్కింపు పూర్తి

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క– సారలమ్మ జాతర హుండీల్లోని కానుకల లెక్కింపు బుధవారం పూర్తయింది. బుధవారం రూ.53,43,231ఆదాయం, 779.800 గ్రాముల బంగారం, 55.150కిలోల వెండి వచ్చింది. మొత్తం 540 హుండీల్లో రూ.13,25,22,511 లభించిందని మేడారం ఈఓ రాజేంద్రం వెల్లడించారు.

## విదేశీ ఉద్యోగాలకు నేడు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

కాశిబుగ్గ సెంటర్ : ఇజ్రాయిల్ (నిర్మాణరంగ కార్మికులు), జర్మనీ (నర్సులు)లో ఉద్యోగాల కోసం వరంగల్ ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నిర్మాణరంగ కార్మికులు ఎస్సెస్సీ ఉత్తీర్ణత, వయస్సు 21–45 సంవత్సరాలు, కనీసం 3 సంవత్సరాల అనుభవం ఉండాలని తెలిపారు. నర్సింగ్ ఉద్యోగాలకు 1–3 సంవత్సరాల అనుభవం ఉండి 21–28 వయస్సు గల అభ్యర్థులు కనీసం బీఎస్సీ/జీఎన్‌ఎం హోల్డర్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వివరాలకు www.tomcom.telangana.gov.inను లేదా 9985483931, 8247838789, 78935664933 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# ‘కాళేశ్వరం’ ముస్తాబు

**నేటినుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం**

- మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు చేసిన అధికారులు, నిర్వాహకులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయంలో (నేడు)గురువారం నుంచి శనివారం వరకు మహాశివరాత్రి ఉత్సవాలను దేవదాయధర్మాదాయశాఖ అధికారులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి వార్ల ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, శివకల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం కాళేశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఉపవాస దీక్షలు, జాగరణ, ఆలయంలో ప్రత్యేక అభిషేక, అర్చన పూజలను నిర్వహిస్తారు. శుభానంద- ముక్తీశ్వరుల కల్యాణం ముత్యాల తలంబ్రాలతో నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కల్యాణానికి హాజరు కానున్నారు.

**పూజాకార్యక్రమాలు..**

7న ఉదయం 10గంటలకు దీపారాధన, గణపతి పూజ స్వస్తిపుణ్యాహవచనం, రక్షాబంధనము, దీక్షా వస్త్రధారణ, ఋత్విగ్వర్ణన మృత్సంగ్రహణము. 11గంటలకు దేవతాహ్వానం నవకలశారాధన, నవగ్రహారాధన. మండప దేవతారాధన, వృషభధ్వజ పటాదివాసము పూజలు. సాయంత్రం 4గంటలకు అగ్ని ప్రతిష్ఠ, రుద్రహవనం. రాత్రి 8గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఎదురుకోలు సేవ కార్యక్రమం. 8.30గంటలకు ప్రసిద్ధ కళాకారులచే భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు.

- 8న సాయంత్రం 4–35 గంటలకు కల్యాణం, అక్షతారోహణం, రాత్రి 8గంటల నుంచి హరికథా కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవపూజ, చండీహోమం కాళరాత్రి హోమం నిర్వహిస్తారు.
- 9న ఉదయం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక, రుద్రాభిషేకం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతి, సదస్యము, మహదాశీర్వచనం, పండిత సన్మానం.
- సాయంత్రం 4గంటలకు ఆదిముక్తీశ్వర స్వామి వారికి కల్యాణం వేదపండితులచే నిర్వహిస్తారు. రాత్రి 8గంటలకు నాకబలి, అనంతరం పవళింపు సేవ కార్యక్రమాలతో శివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయి.
- మహాశివరాత్రి రోజు శివకల్యాణం చేయించే భక్తులు రూ.1,000/- చెల్లించి రశీదు పొందాలని దేవస్థానం అధికారులు తెలిపారు.



శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి జోడు లింగాలు

**ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**



అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. 50వేల లడ్డు, 20వేల పులిహోర ప్యాకెట్లు తయారు చేస్తున్నాం. ప్రత్యేకంగా క్యూ, అదనంగా సిబ్బంది, అర్చకులను తీసుకున్నాం. ఈసారి కల్యాణం వీక్షణకు ఎల్‌ఈడీ తెర ఏర్పాటు చేస్తున్నాం.

-మారుతి, ఇన్‌చార్జ్ ఈఓ, కాళేశ్వరం దేవస్థానం



గోదావరి వద్ద ఏర్పాటు చేసిన నల్లాలు, దుస్తులు మార్చుకునే గదులు